క్లుప్తంగా

అభివృద్ధి పనులకు భూమిపూజ



కమ్మర్‌పల్లి: మండలంలోని హాసాకొత్తూర్ గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు ఏఎంసీ చైర్మన్ పి. నర్సయ్య సోమవారం భూమిపూజ చేశారు. వడ్డెర సంఘ భవనం ప్రహరీ నిర్మాణానికి రూ. 5 లక్షలు, పద్మశాలీ సంఘ భవనం ప్రహరీ నిర్మాణానికి రూ. 3 లక్షలు, ప్రాథమిక పాఠశాలలో కిచెన్ షెడ్ నిర్మాణానికి రూ. 3 లక్షలు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సునీల్‌రెడ్డి హెచ్‌డీఎఫ్ ద్వారా మంజూరు చేయించినట్లు నాయకులు తెలిపారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుంకెట రవి, నాయకులు పడిగెల ప్రవీణ్, రేవతి గంగాధర్, మేడం రమేష్,బుచ్చిమల్లయ్య, ఎడ్ల శ్రీకాంత్, ఏనుగు మనోహర్, మొదిని శ్రీధర్, మహేందర్, రాజేందర్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్ గౌడ సంఘం కార్యవర్గం ఎన్నిక



మోర్తాడ్: మండల గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం మోర్తాడ్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొమ్మ శ్రీకాంత్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా గంగాధర్‌గౌడ్, ప్రధానకార్యదర్శిగా వినీత్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా నవీన్‌గౌడ్, అధికార ప్రతినిధిగా పండరి, సహకార్యదర్శిగా శివసాయిగౌడ్, సలహాదారుగా మనోజ్‌గౌడ్‌లను ఎన్నుకున్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం



నందిపేట్(ఆర్మూర్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సోమవారం నందిపేట మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రధాన వీధుల్లో దుకాణాల వెంబడి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. రాష్ట్రానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ చేసిన అన్యాయాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామీణ వికాసం బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. మండల పార్టీ అధ్యక్షులు పటేళ్ల రాజు, నాయకులు గడ్డె రవికుమార్, కొత్తూర్ ప్రవీణ్, శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.3 కోట్లు



మోర్తాడ్: బాల్కొండ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో అభివృద్ధి పనుల కోసం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ రూ.3 కోట్ల నిధులను ఎంపీ ల్యాడ్స్ నుంచి మంజూరు చేశారని భీమ్‌గల్ మండల బీజేపీ అధ్యక్షుడు ఆరె రవీందర్ తెలిపారు. మండలంలోని ముచ్కూర్ రామాలయం వద్ద కమ్యూనిటీ హాల్ కోసం రూ.4 లక్షలు, రహత్‌నగర్‌లో బస్ షెల్టర్ కోసం రూ.4 లక్షలను కేటాయించారని తెలిపారు. సోమవారం భీమ్‌గల్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. నిధుల మంజూరుకు సహకరించిన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డికి, ఎంపీ అర్వింద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు తోట గంగాధర్, బండారి లక్ష్మణ్‌గౌడ్, భూక్యా మోహన్, రమావత్ వెంకటేష్, శెట్టి ప్రేమ్‌చంద్, కుండల అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్‌లో పాత పద్ధతిని అమలు చేయాలి



నందిపేట్(ఆర్మూర్): ఉపాధి హామీ కార్మికులకు కొత్త రూల్స్‌కు స్వస్తి పలికి పాత పద్ధతిని అమలు చేయాలని రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో నందిపేట ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు కె.గంగాధర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త పద్ధతులను అమలు చేయడంతో ఉపాధి పనులు విజయవంతంగా కొనసాగడం లేదన్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, ఫొటోలు తీయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఎంపీడీవో శ్రీనివాస్‌రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం మండల అధ్యక్షులు రాజలింగం, అనంతరావు, వంజరి గంగాధర్, భూమన్న, జువ్వన్న తదితరులు పాల్గొన్నారు.

తప్పని ఇసుక తిప్పలు

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజీర నది నుంచి ఉచితంగా ఇసుక
- అడ్డుపడుతున్న స్థానిక గ్రామాల ఇసుక ట్రాక్టర్ల యజమానులు
- ఉమ్మడి వర్ని మండలంలో అమలు కాని ప్రభుత్వ ఆదేశాలు



మంజీర నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్



కోటయ్య క్యాంపులో నిర్మాణంలో ఉన్న ఇల్లు

వర్ని: ఉమ్మడి వర్ని మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక తిప్పలు తప్పడం లేదు. పరివాహక ప్రాంతాల ప్రజలు మంజీర నది నుంచి ఎలాంటి చెల్లింపులు లేకుండానే ఉచితంగా ఇసుక తెచ్చుకోవచ్చు అనే ప్రభుత్వ అధికారుల ఆదేశాలు స్థానికంగా అమలు కావడం లేదు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు తహసీల్దారు వద్ద నిర్మాణానికి అవసరమైన ఇసుక కోసం అనుమతి తీసుకుని వెళ్తే ఉచితంగా మంజీర నది నుంచి ఇసుకను తెచ్చుకోవచ్చు. ఈప్రభుత్వ ఆదేశాలు, స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలు ఆచరణలో అమలు కావడం లేదు. మంజీర పరివాహక ప్రాంతాల గ్రామాలైన పోతంగల్, హంగర్గా, కల్లూర్ తదితర గ్రామాల ట్రాక్టర్ యజమానులు ఇసుక తరలింపు అడ్డుకుంటున్నారు. తమ ట్రాక్టర్ల ద్వారానే ఇసుకను తరలించాలని అనధికారిక నిబంధన విధించడంతో ఇందిమ్మ ఇళ్ల లబ్ధిదారులు గత్యంతరం లేక వేలాది రూపాయలు చెల్లించి ఇసుకను కొనుగోలు చేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసిన తాము ఏమీ చేయలేమని చేతులు ఎత్తేసినట్లు లబ్ధిదారులు వెల్లడించారు. మంజీర నది నుంచి వర్ని ప్రాంతానికి ఒక ట్రాక్టర్ ట్రాలీ ద్వారా ఇసుక తరలించడానికి రూ. 5,000 తీసుకుంటున్నారని, వర్ని నుంచి చుట్టుపక్కల గ్రామాలకు దూరాన్ని బట్టి అదనంగా రూ. 500 నుంచి రూ.1500 వరకు డబ్బులు వసూలు చేస్తూ దోచుకుంటున్నారని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. అనధికారిక సమస్యలను లబ్ధిదారులే పరిష్కరించుకోవాలని రెవెన్యూ అధికారులు సమాధానం ఇచ్చినట్లు లబ్ధిదారులు వెల్లడించారు.

చర్యలు చేపడతాం

మంజీర పరివాహక ప్రాంత ట్రాక్టర్ యజమానులు ఇతర ప్రాంతాల వారు నేరుగా ఇసుక తరలించడానికి అడ్డుపడుతున్న మాట వాస్తవమే. ఈ విషయంలో స్థానిక పోతంగల్ తహసీల్దార్ తో చర్చించి పరివాహక ప్రాంత ట్రాక్టర్ యజమానులకు వర్ని ప్రాంతానికి రూ.3,000కే ఇసుక తరలించాలని సూచించామని వెల్లడించారు. ఇందుకు విరుద్ధంగా అదనపు రేట్లతో ఇసుక తరలిస్తే విచారణ చేపడతాం. స్థానిక తహసీల్దార్‌తో చర్చించి తక్కువ ధరకే ఇసుక తరలించే విధంగా చర్యలు చేపడతాం.

– సాయిలు, తహసీల్దార్, వర్ని

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై శైలేందర్

బాల్కొండ: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని బాల్కొండ ఎస్సై శైలేందర్ అన్నారు. సోమవారం స్థానిక కేజీబీవీ, మోడల్ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. యువత గంజాయికి దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో భవాని, మోడల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అరికట్టడానికి విస్తృత తనిఖీలు

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో గంజాయి క్రయ విక్రయాలను అడ్డుకోవడానికి విస్తృతమైన తనిఖీలను నిర్వహిస్తున్నామని సీఐ గుండప్ప సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సర్కిల్ పరిధిలో గతంలో గంజాయికి సంబంధించి కేసులు నమోదు చేశామన్నారు. ఎక్సైజ్ సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు. మత్తు పదార్థాలకు యువత బానిస కాకుండా ఉండటానికి అవగాహన సదస్సులను సైతం నిర్వహిస్తున్నామని తెలిపారు. గంజాయి ఇతర అక్రమ దందాల విషయంలో ఎవరైనా సమాచారం అందిస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రజలు తమకు సహకరించాలని కోరారు. ఏదైనా సమాచారం ఉంటే 8712658977 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

చర్యలు తీసుకోవాలి



ఆర్మూర్‌టౌన్: డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపి, మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పీవైఎల్ రాష్ట్ర నాయకుడు బట్టు రవి అన్నారు. ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ప్రగతి శీల యువజన సంఘం ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నిర్మూలన చేయాలని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాల ఉచ్చులో పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు నరేష్, రవి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

మాల అమరవీరులకు ఘన నివాళి



అంబేడ్కర్ చౌరస్తా వద్ద మాల అమర వీరులకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆర్మూర్ డివిజన్ మాల మహానాడు ఆధ్వర్యంలో మాల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాల అమరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం డివిజన్ అధ్యక్షుడు మాదరి రాజన్న మాట్లాడుతూ 1997 ఆగస్టు 11న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట ఉద్యమంలో పానంగి శేషయ్య, గోపతోటి నారాయణలు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు శెట్టిపల్లి నారాయణ, పింజ పెద్ద భోజన్న, ఎం కోటేశ్వరరావు, చిట్టిమాల నగేష్, పులి గంగాధర్, రొడ్డ సాయన్న తలారి సుదర్శన్, నర్సయ్య, జీవన్, అంగరి ప్రదీప్ లు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' అమలు చేయాలి



నందిపేట్(ఆర్మూర్): ఉపాధి హామీ కార్మికులకు ఇందిరమ్మ భరోసా పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఏఐపీకేఎంఎస్ నాయకు లు డిమాండ్ చేశారు. ఈమేరకు అఖిల భారత ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నాయకులు సోమవారం వెల్మల్ జీపీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం జీపీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐపీకేఎంఎస్ జిల్లా నాయకులు కె.గంగాధర్, రాజలింగం, అనంతరావు, జువ్వన్న, భూమన్న, వంజరి గంగాధర్, పోశన్న తదితరులు పాల్గొన్నారు.

జలాల్ బుకారి దర్గా ఉర్సు ప్రారంభం



బోధన్‌టౌన్(బోధన్): సయ్యద్ షా జలాల్ బుకారి దర్గా ఉర్సు ఆదివారం రాత్రి ప్రారంభమైంది. ఉర్సు సందర్భంగా రెంజల్ బేస్‌లో ఏర్పా టు చేసిన స్వాగత తోరణాలను ఎంఐఎం జిల్లా అధ్యక్షులు ఫయాజొద్దీన్, పట్టణ అధ్యక్షులు ఇలియాస్ అలీ, ఉర్సు కమిటీ ప్రతిధులు ప్రారంభించారు. అనంతరం దర్గా ముత్తావలి ఇంటి నుంచి ఆనవాయితీగా చాదర్ ఊరేగింపు నిర్వహించి దర్గాకు తీసుకవచ్చారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా ఉర్సు ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాట్లాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు ఏర్పాటు చేశామని, పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారని తెలిపారు.

ఇతర గ్రామాలకు మొరం తరలించొద్దు



రుద్రూర్: మండలంలోని రాయకూర్ శివారు నుంచి ఇతర గ్రామాలకు మొరం తరలించొద్దని స్థానికులు డిమాండ్ చేశారు. రాయకూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారులు డీడీలు చెల్లించి మూడు రోజుల క్రితం తహసీల్ కార్యాలయం నుంచి సుమారు 240 ట్రాక్టర్ల మొరం కోసం అనుమతి తీసుకున్నారు. శుక్రవారం 70 ట్రాక్టర్ల మొరం తీసుకెళ్లారు. శని, ఆదివారం బంద్ కావడంతో సోమవారం మొరం తరలింపు చేపట్టారు. ఈ దశలో లబ్ధిదారులకు వేయాల్సిన మొరం, ఇతర గ్రామాలకు తరలిస్తున్నారని సోమవారం కొందరు వ్యక్తులు ఆరోపిస్తూ మొరం తవ్వకాలు చేపడుతున్న ప్రాంతానికి చేరుకుని ట్రాక్టర్లను నిలిపివేశారు. గ్రామ శివారులోని గుట్ట నుంచి మొరం తరలింపుతో అటవీప్రాంతం అంతరించిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం మాత్రమే మొరంకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఘటన స్థలానికి వచ్చి సమస్యను తెలుసుకుని సముదాయించారు.

డెస్క్ బెంచీలు వితరణ



వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ హైస్కూలుకు 20 డెస్క్ బెంచీలను బాల్కొండ మండలం చిట్టాపూర్‌కు చెందిన పారిశ్రామికవేత్త ఏనుగు దయానంద్‌రెడ్డి సోమవారం వితరణ చేశారు. ఈసందర్భంగా బెంచీలు వితరణ చేసిన దయానంద్‌రెడ్డికి హెచ్‌ఎం మల్లీశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిచందర్, రఘునాథ్, సునీత, కాంతయ్య, శ్రీలక్ష్మీ, శ్రీదేవి, యమున, దేవరాజ్, రాజేంద్ర, సదాశివ్, వినోద్, వేణు గోపాల్‌రెడ్డి, జాన్సన్‌రాజు, సీఆర్పీ కృష్ణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, టైలు అందజేత

మాక్లూర్: మండలంలోని మదన్‌పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎంఈవో సత్యనారాయణ చేతుల మీదుగా సోమవారం ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎం నారాయణరెడ్డి దాతలైన మమత, సుమతి, సమత, రాజేశ్వర్‌ల సమక్షంలో విద్యార్థులకు బ్యాగులు, టై బెల్ట్, షూలను అందజేశారు. రూ: 50, 000 విలువ చేసే బ్యాగులు, టై బెల్ట్‌లతో పాటు షూ లను అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయు మండల అధ్యక్షుడు జి నగేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ రాస పెంటయ్య, ఉపాధ్యాయులు కవిత, నారాయణరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

రుద్రూర్: కోటగిరి మండలం వల్లభాపూర్ అంగన్వాడి స్కూల్, యాద్‌గార్ పూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం కోనేరు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రుద్రూర్, కోటగిరి బీజేపీ మండల అధ్యక్షులు అలపాటి హరికృష్ణ, ఎముల నవీన్, మేకల గంగాధర్, అశోక్, సాయిలు, టీచర్లు లోగం రాజేష్ ,హెడ్మాస్టర్ మహమ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్ సేవలు అభినందనీయం



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్): ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన పెంచడానికి ఇస్కాన్ చేస్తున్న సేవలు అభినందనీయం అని ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ శివారులోని అంబం గేట్ వద్ద 4 ఎకరాల భూమి ని కేటాయించి మందిర నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. భూమికి సంబంధించి కొనుగోలు కోసం మార్కెట్ రేటు ప్రకారం డబ్బులు చెల్లిస్తామని ఇస్కాన్ ప్రతినిధులు ఒప్పుకోవడం అభినందనీయమన్నారు. భూమిని త్వరగాఇస్కాన్ ప్రతినిధులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ విఠల్‌కు సూచించారు.

ఉర్దూఘర్ పరిశీలన

పట్టణంలోని ఉర్దూఘర్‌ను ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పరిశీలించారు. ఉర్దూఘర్ శిథిలావస్థకు చేరుకుందని నూతన భవన నిర్మాణానికి అంచనాలతో కూడిన ప్రతిపాదనలు తయారు చేయాలని ఆర్‌అండ్‌బీ డీఈకి సూచించారు. ప్రజల అవసరాలను తీర్చే విధంగా ఉండాలన్నారు. అనంతరం బెల్లాల్ సమీపంలో మైనారిటీలకు గ్రేవ్ యార్డు కోసం 2.30 ఎకరాల భూమిని కేటాయించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజిరెడ్డి, రాష్ట్ర అగ్రి కల్చర్ డైరెక్టర్ గొడుగు గంగాధర్,టీపీసీసీ కార్యదర్శి నగేష్ రెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ ప్రెసిడెంట్ నరేందర్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి విష్ణు వర్ధన్ రెడ్డి, నాయకులు బిల్లా రామ్మోహన్, ఎల్లయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న సాటాపూర్ చౌరస్తా



నీటితో నిండి ఉన్న సాటాపూర్ చౌరస్తాలోని బోధన్ రోడ్డు

రెంజల్(బోధన్): కొద్ది పాటి చిరు జల్లులు కురిసినా పలు గ్రామాల్లోని ప్రధాన రహదారులు బురదమయంగా మారి చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లపై ప్రయాణం చేస్తే దుస్తులు మట్టితో నిండిపోతున్నాయి. మండలంలోని సాటాపూర్ గ్రామంలోని తెలంగాణ చౌరస్తాలో గల నాలుగు రోడ్లకు ఇరువైపులా నీరు చేరి ప్రమాదాలకు దారితీస్తుంది. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి సాటాపూర్ నుంచి బోధన్ వెళ్లే మార్గంలో రోడ్డు చెరువును తలపిస్తుంది. రోడ్డుకు ఇరు వైపులా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపునీరు రోడ్డు పై నిల్వ ఉంటుంది. ఇక్కడ వ్యాపార సముదాయాలతో పాటు ఎస్‌బీఐ బ్యాంకు ఉంది. నిత్యం పలు గ్రామాల నుంచి వందల సంఖ్యలో లావాదేవీలకు వస్తుంటారు. వీరితో పాటు బోధన్ నుంచి మండలానికి వచ్చే ప్రధాన రహదారి కావడంతో రాకపోకలు అధికంగా ఉంటాయి. అధికారులు సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అధ్యాత్మికం

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే జాతీయ పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి పూజలు చేశారు. అలాగే నందీశ్వర మహరాజ్ సమక్షంలో నిర్వహించిన స్వామివారి ఉత్సవ విగ్రహాల పల్లకీ సేవలో పల్లెగంగారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో బి.సుమన్, పీసీగంగారెడ్డి, మల్లయ్య, చరణ్‌రెడ్డి, బీజేపీనాయకులు కంచెట్టి గంగాధర్, ద్యాగ ఉదయ్, భక్తులు పాల్గొన్నారు.

శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన



వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలోని రామాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన శివాలయంలో సోమవారం పార్వతి, పరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య వీడీసీ సభ్యులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు, హోమం, అభిషేకాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలు బుధవారం వరకు కొనసాగనున్నాయి. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. శ్రావణమాసం సోమవారం సందర్భంగా రామన్నపేట్ అయ్యల గుట్ట రాజరాజేశ్వరిస్వామిని దర్శించుకొని భక్తులు పూజలు నిర్వహించారు. పడగల్‌లోని రాజనర్సింహా హరిహర క్షేత్రంలో భక్తులు పూజలు చేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు ..అన్నదానం

రుద్రూర్: మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం , శ్రీవీరభద్ర స్వామి ఆలయం ,గైని గుట్ట స్వయం భూబసవేశ్వరాలయం లో శ్రావణ సోమవారం పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతా మూర్తులకు అభిషేకం, అన్నపూజ చేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఎరువుల స్టాక్ వివరాలు ప్రదర్శించాలి



బోర్గాం సొసైటీ గోదాములో ఎరువుల నిల్వలు పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): జిల్లాలో అన్ని సహకార సంఘాల గోడౌన్లలో ఎరువుల స్టాక్ వివరాలు బోర్డులో ప్రదర్శించాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. సోమవారం బోర్గాం(పి)లోని సహకార సంఘం ఎరువుల గోడౌన్‌ను ఆయన సందర్శించి ఎరువుల స్టాక్ పరిశీలించారు. ఎరువుల కొరత ఉందా అని నిర్వాహకులను ప్రశ్నించగా, రైతుల అవసరాలకు సరిపడా యూరియా, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఇప్పటివరకు ఎలాంటి కొరత ఏర్పడలేదని వివరించారు. అంతకుముందు ఆయుష్మాన్ భారత్ – హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్, శాఖ గ్రంథాలయాన్ని పరిశీలించారు. పల్లె దవాఖానాను సందర్శించి రోగులకు అందిస్తున్న సేవలు, రికార్డులను తనిఖీ చేశారు. హెల్త్ సెంటర్‌కు నూతన భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం శాఖ గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. పాఠకులకు అనువుగా ఉండేలా లైబ్రరీని మరో భవనంలోకి మార్చాలని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డిని ఆదేశించారు. లైబ్రరీలో సమయ పాలన విధిగా పాటించాలని, అన్ని రకాల పత్రికలు, పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సూచించారు.

ఆల్బెండజోల్ మాత్రల అందజేత



పోచంపాడ్‌లో నులిపురుగుల మాత్రలు వేస్తున్న డీఎస్‌వో నాగరాజు



పెర్కిట్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్

సాక్షి నెట్‌వర్క్ : ఆర్మూర్, బాల్కొండ, బోధన్, బాన్సువాడ నియోజకవర్గాల్లోని గ్రామాల్లో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో సోమవారం నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను ఉపాధ్యాయులు అందజేశారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం

'మానవ సంబంధాలపై సాంకేతిక ప్రభావం' పై వ్యాసరచన పోటీలు

కమ్మర్‌పల్లి: మండలంలోని చౌట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 14న 'మానవ సంబంధాలపై సాంకేతిక ప్రభావం' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లుక్క గంగాధర్, కోశాధికారి తెడ్డు రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ. 1116, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 751, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 501 నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామని వెల్లడించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంగలకు వరకు పరీక్ష ఉంటుందన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలియజేశారు.

ఆర్థిక సహాయం అందజేత

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రానికి చెందిన బీజేపీ పార్టీ కార్యకర్త వడ్ల రాజేశ్వర్ అక్క కల్లెడ రాజమణి అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. ఆమె అంత్యక్రియల కోసం బీజేపీ నాయకులు రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీమండల అధ్యక్షుడు అంబటినవీన్, నాయకులు లింగాగౌడ్, ఆరేపల్లి నర్సయ్య, అశోక్, రాము, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

బాల్కొండ: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మెండోరా తహసీల్దార్ సంతోష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో వంట సామగ్రిని పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులను మెనూ ప్రకారం భోజనం అందించకుంటే ఫిర్యాదు బాక్సులో ఫిర్యాదు చేయాలన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

వేల్పూర్: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీవో సాయిలు సోమవారం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం వండింది లేనిది చూశారు. వంతపాత్రలు బాగా శుభ్రం చేసి వండాలని నిర్వాహకులకు సూచించారు.

శక్కర్‌నగర్ పద్మశాలి సంఘం కమిటీ ఎన్నిక

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని శక్కర్‌నగర్ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. పద్మశాలి సంఘం సర్వసభ్య సమావేశాన్ని ముఖ్య కార్యదర్శి తాటిపాముల నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షులుగా పున్న రాములు, ఉపాధ్యక్షులుగా లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా స్వామి, కోశాధికారిగా బిల్లా శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా శ్యామల నాగరాజు, ఆర్గనైజేషన్ సెక్రెటరీగా ముత్యాల సంజీవ్, సలహాదారులుగా గుండ రాజయ్య, శ్యామల శివకుమార్, కార్యవర్గ సభ్యులుగా కర్రె వెంకటరమణ, కోడూరి రవి, ముత్యాల అనిల్, భూషణ్, జనార్దన్, గంగామణిలు ఎన్నికయ్యారు.

13న ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలం పాట

బోధన్‌టౌన్(బోధన్): ఈ నెల 13న బోధన్‌లోని ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో వాహనాల వేలం పాట నిర్వహిస్తున్నట్లు సీఐ భాస్కర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ శాఖకు సంబంధించిన వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం పాట ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని సీఐ వెల్లడించారు.